## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1-7-04, చింతపర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శిరిడీసాయిబాబా విగ్రహప్రతిష్టాకార్యక్రమంలో పాల్గొనటానికి మనందరం ఇక్కడకు వచ్చిఉన్నాము. బాబాగారి తల్లిదండ్రులు ఎవరో తెలియదు, ఆయనది ఏమతమో తెలియదు. శ్రీరామనవమి రోజున భగవంతుడే ఆయన శరీరాన్ని సృష్టించాడు అంటారు. బాబాగారు నిజమైనసన్యాసి ఎందుచేతనంటే మాకు కులాభిమానంలేదు, మతాభిమానంలేదు అని మనం నోటితో చెపుతాముకాని లోపల అంతా కులాభిమానమే, మతాభిమానమే బాబాగారికి కులంతోటిగాని, మతంతోటిగాని, ఒకప్రాంతంతోటిగాని సంబంధంలేదు. ఆయన నిజమైనసన్యాసి, సమర్ధసద్గురువు, పరమగురువు. బాబాగారు గురుపూర్ణిమ, శ్రీరామనవమి, విజయదశమి ఈమూడు పండుగలు చేసేవారు. బాబాగారిని కొంతమంది శ్రీరాముడుగా అర్చనచేస్తారు, అందుకే బాబాగారిని సింహాసనంమీద కూర్చోబెట్టి, కిరీటం పెట్టి మహారాజుగా అలంకారంచేస్తారు. కొంతమంది ఆయనను దత్తాత్రేయుడుగా పూజిస్తారు, కొంతమంది ఆయనను హనుమాన్‌గా పూజిస్తారు. నేను శిరిడీవెళ్ళినప్పుడు బాబాగారు నాకు స్వప్నంలో బాలహనుమాన్‌గా దర్శనమిచ్చారు. బాబా విగ్రహంచూసేటప్పటికి నాకు బాలహనుమాన్ గుర్తుకువస్తాడు. విశ్వాసం, ఓర్పు ఈరెండింటిని స్వీకరించమని బాబాగారు జీవితం పొడుగునా చెప్పారు. కాఫీలో పంచదార ఎలాకలుపుకొంటామో అలాగ విశ్వాసంలో, ఓర్పులో ధైర్యంకలుపుకోండి అని బాబాగారు చెప్పారు. మీకు ధైర్యం ఉంటేనే విశ్వాసం నిలబడుతుంది, ఓర్పునిలబడుతుంది అని ఆయన చెప్పారు. విశ్వాసం, ఓర్పు ఈరెండింటిని జీవితం పొడుగునా ప్రాక్టీసు చేయమని చెప్పారు. అహంత, మమత ఈరెండింటిని విడిచిపెట్టమని బాబాగారు చెప్పారు. అల్లాహో అక్బర్ అంటే అందరికంటే భగవంతుడు గొప్పవాడు అని. మాలోఏదో ఆధిక్యత ఉందని మీరుఎవ్వరూ అనుకోవద్దు, మీలో ఆధిక్యత ఏమీలేదు, అహంకారంఉంది అంతే. మీ అహంకారమే మీకు ఆధిక్యత కింద కనిపిస్తోంది. నాలోఏదో ఆధిక్యత ఉంది అని అనుకోవటం వలన భగవంతుడికి దూరమయిపోతారు, దేహానికి దగ్గరఅవుతారు, లోకానికి విషయాలకు దగ్గరవుతారు. నాలోఏదో విశేషం ఉంది, నాలో ఏదో ఆధిక్యత ఉంది అనేటువంటి పెంటగోడవలను విడిచిపెట్టమని బాబాగారు చెప్పారు. భగవంతుడికంటే మనం తెలివైనవారము అనుకొంటూఉంటే ఇంకమనం భగవంతుడిని ఏమి అర్చనచేస్తాము, ఇంక భగవంతుడిని ఏమిప్రేమిస్తాము.

బాబాగారు శిరిడీకి రాకముందు అడవిలో ఉండేవారు. బాబాగారు అరణ్యంలో ఒకచెట్టుకింద కూర్చొని ఉండగా సమీపగ్రామంలో ఉన్న ఒకరు తనగుర్రం పోయిందని, ఆ



గుర్రంమీద ఆధారపడి బతుకుచున్నాము అని ఆయన దగ్గరకువచ్చి చెప్పాడు. అప్పుడు బాబాగారు అతని గుర్రం ఫలానాచోట గడ్డిమేస్తోంది అని చెప్పారు. బాబాగారు చెప్పిన చోటుకు వెళితే అక్కడఅతని గుర్రం ఉంది. అప్పుడు అతను గుర్రాన్ని తోలుకొని బాబాగారి దగ్గరకువచ్చి మీరునాకు గుర్రం దొరికేలా చేసారు, మీరు మాఇంటికి రండి అన్నాడు. ఈరోజురాను, రేపువస్తాను అని బాబాచెప్పారు, అలాగే మరుసటిరోజు బాబాగారు అతని ఇంటికి వెళ్ళారు. బాబా అక్కడఉండగా ఒకపెళ్ళి సంబంధం కుదిరింది, మగపెళ్ళివారిది ఇప్పుడు బాబా ఉన్న ఊరు, ఆడపెళ్ళివారిది శిరిడీ. మీరుకూడా పెళ్ళికి శిరిడీ రావాలని వారు బాబాను అడిగారు, బాబా సరే అన్నారు. బాబాను బండిమీద శిరిడీ తీసుకొనివెళ్ళారు. శిరిడీలో ప్రాచీనకాలంనుండి విష్ణువుకి సంబంధించిన గుడి ఒకటి ఉంది, ఆగుడి ఏరియాలో బళ్ళుఅన్ని ఆపారు. బాబాను అప్పుడు ఫకీర్ అనేవారు. బాబా బండి దిగుతూ ఉంటే ఆలయధర్మ కర్తచూసాడు. అధ్భుతమైన దయ, ప్రేమ ఆయనకు బాబా మొఖంలో కనిపించాయి. ధర్మకర్త దగ్గరకు వచ్చి యా సాయిబాబా అన్నాడు అంటే స్వాగతం అయ్యా సాయిబాబా అని, అప్పుడు వచ్చింది సాయిబాబా అని పేరు. శిరిడీకి ఇంతకాలానికి వచ్చావు నీకు స్వాగతం అయ్యా సాయిబాబా అని దేవాలయ ధర్మకర్త నోటివెంట వచ్చిన ఆపేరు విశ్వవ్యాప్తమయ్యింది. అప్పుడు ధర్మకర్త సాయిబాబాతో మీరు పెళ్ళికి వచ్చి వెళ్ళటం కాదు, ఇక్కడ శిరిడీలో ఉండిపోవాలనికోరాడు, అది జన్మాంతర అనుబంధం. బాబా గురువులు అందరికి ఒకమాట చెప్పారు. మీ దగ్గరకు వచ్చిన వారిమీద చిరాకుపడకండి. ఎందుచేతనంటే పూర్వజన్మలో మీతో అనుబంధం ఉన్నవారే మీ దగ్గరకు వస్తారు, లేకపోతేరారు అందుచేత వారిని విసుక్కోవద్దు అని బాబా చెప్పారు. 1858వ సం॥లో బాబాగారు శిరిడీ వచ్చారు. ఆయన సుమారు 60 సంవత్సరాలు శిరిడీలో ఉన్నారు. 1918వ సం॥లో అక్టోబరు నెల 15వ తేదీన బాబాశరీరం విడిచిపెట్టారు. బాబాకు శరీరం పుట్టినరోజులేదు. ఆదేహం శ్రీరామనవమిరోజున సృష్టించబడింది కాబట్టి శ్రీరామనవమి రోజున పుట్టినరోజు చేస్తారు. తల్లికి బిడ్డలకు ఎటువంటి సంబంధం ఉంటుందో బాబాకు భక్తులకు అటువంటి సంబంధం ఉండేది. నాశరీరంతో సంబంధంలేదు, ఈశరీరం లేకపోయిన నేను మీతో కలిసే ఉంటాను, మీ కష్టసుఖాలలో పాల్గొంటాను, మీ కష్టాలను తీరుస్తాను, మీ కోరికలను నెరవేరుస్తాను, మీ కోసంపనిచేస్తూ ఉంటాను, భౌతికశరీరానికి దీనికి ఎటువంటి సంబంధంలేదు అని బాబాచెప్పారు. బాబాదగ్గర నటనలేదు, బాబాకు బ్యాంక్‌ఎక్కౌంటు లేదు. ఎవరైనా ధనవంతులు డబ్బుఇస్తే చేతితోపుచ్చుకొనేవాడు, మరల పేదవారికి ఆధనం ఇచ్చేసేవాడు. ఒకదొంగ ఇంటిలోని వస్తువులను తీసుకొనిపోతూ ఉంటే పోలీసువారు పట్టుకొని మేజిస్ట్రేట్ దగ్గరకు తీసుకొని వెళ్ళారు. ఈవస్తువులను ఎక్కడ

దొంగిలించావు అని అడిగితే నేను దొంగతనం చేయలేదు, నేను షిరిడీ వెళ్ళాను, వాటిని సాయిబాబా నాకు ఇచ్చాడు అని చెపుతాడు. అప్పడు మేజిస్ట్రేట్ బాబాకు సమన్లు పంపండి అన్నారు. ఆయన పెద్దాయన, ఆయనను ఇక్కడకు తీసుకొనిరావటం బాగుండదు, ఎవరినైనా పంపటం మంచిది అని అంటే అప్పడు ఆయన తరపున ఒకరిని బాబాదగ్గరకు పంపుతారు. అతను బాబాదగ్గరకు వచ్చి, మీ పేరు ఏమిటి అన్నాడు, ఈ శరీరాన్ని సాయిబాబా అంటారు అని బాబా చెప్పారు. నీ తండ్రి పేరు ఏమిటి అని అడిగితే సాయిబాబా అన్నారు. మీమతం ఏమిటి అని అడిగితే నామతం భగవంతుడు అని చెప్పారు, నీకులం పేరు ఏమిటి అని అడిగితే, నాకులం పేరు భగవంతుడు అని చెప్పారు. నీవయస్సు ఎంత అని అడిగితే నావయస్సు 500 సం॥లు అని చెప్పారు. ఇదేమిటి అని అడిగితే చెప్పింది రాసుకో అన్నారు బాబా, 500 సం॥లు అంటే ఆయన ఎప్పడూ ఉన్నాడు, ఆయనకు వయస్సు ఏమిటి? శరీరానికి వయస్సు కాని బాబాకు వయస్సు ఏమిటి, ఆయనకు వయస్సుతో సంబంధంలేదు. ఫలానా వస్తువు నీవు ఇచ్చావు అని చెపుతున్నాడు, మేము రికార్డు వ్రాసుకోవాలి ఆవస్తువులు నువ్వు ఇచ్చావా అని బాబా గారిని అడిగాడు. ఏమి ఈగోల, ఆగోలతోటి నాకేమి సంబంధం అన్నారు. అది వ్రాసుకొని ఆప్లీడరు వెళ్ళిపోయాడు.

కళ్యాణ గుణాలు లేకుండా, దైవీగుణాలు లేకుండా ఆత్మజ్ఞానం రాదు అని బాబా చెప్పారు. పునాది లేకుండా ఇల్లుకడితే అది నిలబడదు అలాగే కళ్యాణగుణాలు లేకుండా, దైవీగుణాలు లేకుండా మీరు ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేస్తూఉంటే మీరు ఫెయిల్ అవుతారుకాని సక్సెస్ అవ్వలేరు. 1917వ సం॥లో తిలక్‌గారు బాబాగారి దగ్గరకు వచ్చారు. ఎవరోస్నేహితుడు తీసుకొనివచ్చి తిలక్ గారిని బాబాగారికి పరిచయం చేసాడు. ఈయన గొప్పనాయకుడు, దేశభక్తుడు, గొప్పపండితుడు, బహుముఖమేధావి అని తిలక్ గురించి బాబాకు చెప్పాడు. అప్పడు బాబాగారు ఒకమాట చెప్పారు. ఆయనచేసిన పనిమంచిదే కాని ఆయన టైముఅయిపోతోంది, కొత్తనాయకుడు వస్తున్నాడు అని బాబాఅన్నారు. 1920వ సం॥లో తిలక్‌గారు శరీరం విడిచిపెట్టారు, 1921లో గాంధీగారు నాయకత్వం లోనికి వచ్చారు. బాబాగారికి అన్నదానం అంటే బాగాఇష్టం. బాబా రోజూ బిక్షకు వెళ్ళేవారు. బిక్షతెచ్చుకొన్న అన్నం ఎవరికో ఒకరికి పెట్టకుండా బాబా తినేవారు కాదు. తక్కువ తినండి, తక్కువ మాట్లాడండి అని బాబా చెప్పేవారు కాని మనం ఎక్కువగా తింటున్నాము, ఎక్కువగా మాట్లాడుతున్నాము. పాండిత్యం, డబ్బు, అధికారం లేకపోయిన భగవంతుడి మీద విశ్వాసం ఉంటే చాలు వాడికి ఆత్మానందం కలుగుతుంది అని బాబా చెప్పారు. బాగాధనం ఉండి ఎవరైనా లోభిత్వంగా ఉంటున్నారు అనుకోండి వారిని మీ జేబులో 100రూ॥ ఉన్నాయి



ఇలా ఇవ్వండి అని బాబా అడిగేవారు. ఎందుచేతనంటే వారికి లోభిత్వం అనే గుణం పోగొట్టటానికి బాబా అలా అడిగేవారు, వారి జేబులో ఎంతఉందో బాబాకు తెలిసేది. బాబాకు రాజకీయం గొడవలేదు, కులాల గొడవలేదు, మతాల గొడవలేదు, అన్నింటికి అతీతంగా ఉండేవారు, ఎప్పడూ నిర్మలంగా ఉండేవారు బాబా. చావుపుట్టుకలతో సంబంధం లేకుండా ఏదైతే అంతటా వ్యాపించి ఉందో దానిని తెలుసుకో అని గీతలో పరమాత్మచెప్పాడు. జ్ఞానాన్ని గురువును ఆశ్రయించినేర్చుకో. గురువు దగ్గర ఎలా ఉండాలో ఇక్కడ భగవంతుడు చెపుతున్నాడు. హృదయపూర్వకంగా, నిండుమనస్సుతో గురువుకు నమస్కరించు, అందులో కపటం ఉండకూడదు. గురువు హృదయంలో జ్ఞానం ఉంటుంది కాని అది రోజా పొంగదు. తగిన భక్తుడు వచ్చినప్పడు విశ్వాసపాత్రుడు వచ్చినప్పడు గురువు హృదయంలో ఉన్న జ్ఞానసముద్రం పొంగుతుంది. జ్ఞానసముద్రం పొంగకపోతే గురువుకూడా జ్ఞానాన్ని మన మీద వర్షింపచేయలేడు. మనం ఏదైనా అడిగేటప్పడు గౌరవంగా అడగాలి. ఆయనకు ఒకవేళ అనారోగ్యంగా ఉన్నప్పటికి మనం మాట్లాడే విధానం ఆయనకు చెప్పబుద్ది కలగాలి. గురువునుగౌరవించాలి, గురువును సేవించుకోవాలి, గురువు అవసరాలు ఏమిటో వాటిని తెలుసుకొని, వాటిని చూడాలి. తత్వాన్ని దర్శించినవాడే గురువు. గురువు తన హృదయంలో ఉన్న జ్ఞానం గురించి భోదిస్తే జుర్రుకోగలముగాని ఆయన భోధించకుండా ఎక్కడ జుర్రుకొంటాము. అది జ్ఞానపాయసం, కంచంలో పాయసం పోయకుండా జుర్రుకోండి అంటే ఏమి జుర్రుకొంటాము. జ్ఞానిని గౌరవించి, సేవించి, నమస్కరించి జ్ఞానం గురించి అడిగి తెలుసుకొని జ్ఞానాన్ని సంపాదించుకో అని భగవంతుడు చెప్పాడు, జ్ఞాని ఆత్మలో భగవంతుడే ఉంటాడు అందుచేత జ్ఞానికి పెట్టిన నమస్కారం నాకు అందుతుంది అని భగవంతుడు చెప్పాడు. జ్ఞానిభగవంతుడు వేరుకాదు. జ్ఞాని యొక్క ఆత్మే వాసుదేవుడు. జ్ఞానికి చేసిన గౌరవం ఈశ్వరుడికి అందుతుంది అని భగవంతుడు గీతలో చెప్పాడు. బాబాగారు ఎంతసేపు మహిమలు చూపించారు కానిభోదలేదు అని చాలామంది అభిప్రాయం కాని అది తప్పడు అభిప్రాయం, వారు తీసుకోవటంలో పొరపాటు. బాబాగారికి బోధ ఉంది కానివాగుడు లేదు, ఉపన్యాసాలు చెప్పేఅలవాటు బాబాకు లేదు, సమయం వచ్చినప్పడు సబ్జక్టు టీచ్‌చేసేవారు. బాబాగారి టీచింగ్‌లో క్వాలిటీ ఉంది.

శ్రద్ధలేకుండా మనకు జ్ఞానం రాదు. జ్ఞానం సంపాదించేటప్పడు న్యూనత కనుక పెట్టుకొంటే జ్ఞానంరాదు. నాన్నగారు ఇక్కడ నాలుగు మాటలు చెపుతున్నారు. మనం ఇక్కడ కూర్చొంటే రోడ్డు మీద వెళ్ళేవారు మన గురించి ఏమనుకొంటారో అని ఇలా మనం అనుకొంటూఉంటే మనకు జ్ఞానం ఏమిటి? పూర్వజన్మలో మనం ఎంతో కృషిచేసి ఉంటేనే

జ్ఞానం పట్ల మనకు కాంక్ష కలుగుతుంది. ఇంద్రియాలను నియమించుకోవటం, ఇంద్రియాలను సంస్కరించుకోవటం, ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవటం అది కర్మయోగం యొక్కగమ్యం. మన మనస్సులో ఉన్న దోషాలను, బలహీనతలను తీసుకోవటమే భక్తియోగం యొక్కగమ్యం, భక్తి వలన మన మనస్సులో ఉన్న వెలితిపోవాలి. నేను మీకు ఏదో చెపుతున్నాను అనుకోండి, అది ఎందుకు చెపుతున్నానో దానిని మీరు వెంటనే గ్రహించాలి. నేను చెప్పేమాటలలో పొల్లుమాటలు ఉంటే తీసేయాలి. ప్రతీ మనిషికి సొంత బుద్ధిఉండాలి. జ్ఞానయోగం అంటే వివేకాన్నిపెంచుకోవాలి,బుద్ధిసూక్ష్మతను పెంచుకోవాలి. మనం ఈ భూమి మీద ఉండగా చెయ్యవలసిన కర్తవ్యం ఏమిటి? మనం సజ్జనసాంగత్యం చేస్తున్నామా లేకపోతే దుష్టసాంగత్యం చేస్తున్నామా అని విడదీసుకొనేదే నిజమైన వివేకం. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని గ్రహించటానికి బుద్ధిసూక్ష్మత అవసరం. బుద్ధిసూక్ష్మతలేదు అనుకో నీవు భగవద్గీత చదివినా అది నీగుండెకు పట్టదు. మనం ఏదైవాన్ని అయితే ఆరాధిస్తున్నామో ఆదైవంతో మనకు తాదాప్యం వచ్చేయాలి, గురువుతో మనకు తాదాప్యం రావాలి. ఎవడికైతే ఆత్మజ్ఞానం కలిగిందో, ఎవడైతే పరమాత్మతో తాదాప్యం పొందాడోవాడు శాంతిలో, ఆనందంలో ఊగిసలాడుతూ ఉంటాడు. పరమాత్మజ్ఞానం పొందినవాడు జ్ఞానగంగలో, శాంతిగంగలో ఈదులాడుతూ ఉంటాడు.

నిన్ను ఎవరైనా స్తోత్రం చేసినప్పడు ఏదో వచ్చేస్తోంది అనుకొంటున్నారు, పిచ్చోడా నీకు ఏమీరాదు. నిన్ను ఎవరైనా విమర్శిస్తూ ఉంటే ఏదోపోతోంది అనుకొంటున్నావు నీకు ఉన్నది ఏమీపోదు. ఇవన్నీ భ్రాంతిగొడవలు అన్నారు బాబా. ఈస్తోత్రాలు, విమర్శల గొడవలు వదిలెయ్యి, అసలు అటుచూడనే చూడకు అని బాబా చెప్పారు. సూర్యుడు ఉదయించినప్పడు ఏ కలర్‌లో ఉంటాడో అస్తమించేటప్పడు కూడా అదే కలర్‌లో ఉంటాడు. నేను అస్తమిస్తున్నానని ఏడుస్తూ కూర్చోడు. అందుచేత నీవు కూడా సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా సూర్యుడులాగ ఒక్కలాగే ఉండు, సమానంగాఉండు. ఒకసారి బాబాగారు, ఆయన దగ్గర కూర్చొన్న ఒక అమ్మగారితో మీరు 600 సం॥ల క్రితం నాకు తెలుసు అన్నారు అంటే ఆ అమ్మగారు నాకు 30సం॥లు ఉన్నాయి, మీరు ఏమిటి ఇలా చెపుతున్నారు అంది. నీపూర్వజన్మలుఅన్నీ నాకు తెలుసు, ఆపూర్వజన్మలో ఉన్న అనుబంధమే నిన్ను ఇక్కడకు తీసుకొనివచ్చింది అన్నారు బాబా. అసూయపనికిరాదు, పూర్వజన్మ కర్మ ఫలితాన్ని బట్టివారు బాగుండవచ్చు, దానినిచూసి మీకు అసూయ ఎందుకు? అసూయవలన మీకు ఏమికలిసివస్తుంది. నీవు ఇతరులను భయపెట్టవద్దు, ఇతరులనుచూసి నీవు భయపడవద్దు అసలు భయపడవలసిన పని నీకులేదు. నువ్వు అసూయలోనుండి బయటకురాలేదు,



భయంలోనుండి బయటకు రాలేదు, దుఃఖంలోనుండి బయటకు రాలేదు, వీటిలోనుండి బయటకువస్తే ఉన్నది మోక్షమే అంటున్నారుబాబా. మీకు ఎప్పడైనా కష్టాలువస్తే కంగారుపడకండి, పేదరికంవస్తే కంగారు పడకండి. కష్టాలలో ఉన్నవారికి, పేదరికంలోఉన్న వారికి భగవంతుడు సహోదరుడుగా ఉంటాడు అని బాబా చెప్పారు. కొంతమంది వారికి పేదరికం లేకపోయినా పేదరికాన్ని వరించినవారు ఉన్నారు. అంటే పేదరికాన్ని వరించమనికాదు బాబాచెప్పేది పేదరికానికి ఉన్న సత్యత్వం ధనానికి లేదు అని బాబాచెప్పారు.

ఎప్పడైనా ఒకోసారి ఉద్రేకాలు వస్తాయి, ఒకోసారి భయాలు వస్తూఉంటాయి, వాటితో తాదాప్యం పొందవద్దు. సాధనచేసేటప్పడు నీకు ఏదైనా అనుభూతులు కలుగుతూ ఉంటాయి, స్వరూపజ్ఞానం కలిగేవరకూ మీరు ప్రయాణం ఆపుచేయవద్దు. జ్ఞానం పర్మెనెంట్‌గా ఉంటుంది. వచ్చి, వెళ్ళిపోయేది జ్ఞానంకాదు. ఈరోజు శాంతివచ్చి మరల రేపుపోతుంది అనుకోండి అది బాహ్యకారణాలవలన, నీకు ఉన్న మమతవలన, అహంత వలన వచ్చేదే కాని అది స్వతంత్రమైన శాంతికాదు, అది స్వతంత్రమైన ఆనందంకాదు. అందుచేత మీరు కానిదానితో దేనితోనూ మీరు తాదాప్యం పొందవద్దు. బాబాగారు చెపుతూ ఉండేవారు. నీగురువుమీద నీకు ఉన్న విశ్వాసం నిజమైతే మృత్యువుకు కూడా భీతి కలుగుతుంది, అది విశ్వాసం యొక్క గొప్పతనం. మృత్యువువచ్చి తీసుకొని వెళుతూఉంటే నేను ఎక్కడకు వెళ్ళటంలేదు, అంతటా ఉన్నాను, గురువులోనే ఉన్నాను అని అనిపిస్తుంది, గురువు అంటే చైతన్యమే. ఒకసారి బాబాభక్తుడికి స్వప్నం వచ్చింది. బాబా నీటిలో నిలబడిఉన్నారు, మోకాలువరకు నీళ్ళు ఉన్నాయి. బాబా నీపాదాలకు నమస్కారం పెట్టాలని ఉంది నీ పాదాలు చూస్తే నీటిలో ఉన్నాయి అంటున్నాడు ఆ భక్తుడు. అప్పడు బాబా అన్నారు పాదాలు దొరకటానికి నీవు చేసిన సాధన ఏమిటి? నువ్వు చేసిన కృషి ఏమిటి? అప్పడు అతనికి తపన కలిగింది. ఆ తపన కలిగినప్పడు బాబా నీటిలో నుండి కాళ్ళుపైకి తీసారు. అంటే తపన ఏర్పడ్డాక బాబాపాదాలు భక్తుడికి అందినాయి. భక్తిలేకపోతే, ఆతపనలేకపోతే పాదాలు అక్కడ ఉన్నా అవి నీకు దొరకవు. మీకు జ్ఞానం కావాలంటే శ్రద్ధ అవసరం. బాబా ఏవైనా మహిమలు చేసిచూపించారు అంటే అవి కేవలం మహిమలకోసం కాదు, అవినిజంకాదు అని ఆయనకు తెలుసు, తద్వారా మీకు ఈశ్వరుడిపట్ల విశ్వాసంకలుగజేసి మిమ్మల్ని తరింపచేయటానికే అవిఅన్ని చేసారు, మిమ్మల్ని ఎక్కడకు తీసుకొనివెళ్ళాలో ఆయనకుతెలుసు. మీదేహప్రారబ్దాన్నిబట్టి ఒకోసారి కష్టంవస్తుంది, ఒకోసారి సుఖంవస్తుంది, ఒకోసారి సంతోషంవస్తుంది, ఒకోసారి దుఃఖంవస్తుంది, ఒకోసారి లాభంవస్తుంది, ఒకోసారి నష్టంవస్తుంది ఇలా ద్వంద్వాలు వస్తూఉంటాయి. వాటిని జాగ్రత్తగా ఓర్చుకోవాలి, ధైర్యంగా ఉండాలి, అప్పడు దేవుని యొక్క అనుగ్రహం, అల్లాయొక్క

